
స్వామి రాసిన కథ
అచ్చతెనుగు కథ

# అమ్మ



నాది టీచరుగా ఉద్యోగం. ఈ మధ్యే హిందూపురం ట్రాన్స్‌ఫర్ కావడం వల్ల అక్కడే వుంటూ శని, ఆదివారాలు మాత్రం అనంతపురానికి రాకపోకలు జరుపుతున్నాను. ఆరోజు శనివారం. బస్సు దిగి ఇంటికి రాగానే అమ్మనుఆస్పత్రిలో చేర్చినట్టు వార్త. కాళ్ళు ఒణికాయి. గుండె కంపించింది.

ఆస్పత్రి పడక మీద అమ్మ నిద్రపోతూ కూడా దేనికో ఆందోళన పడుతున్నట్టు ముఖం.'అమా అమ్మా!' అని పిలుస్తుంటే "పల్కినా లేవదు. కోమా" అన్నాడు అన్నయ్య. "ఏమైంది అమ్మకు? డాక్టరు ఏమన్నాడు?" అని ఆదుర్దాగా అడిగితే "డాక్టరు నద్దకు పోయి మాట్లాడి వద్దంరా" అని బయటికి చేయి పట్టుకు పిల్చుకుపోయి "కామెర్లు"అన్నాడు డాక్టరు. ఇన్నాళ్ళూ మనం కనుక్కోలేకపోయాము. చానా ముదిరిపోయినాయంట!"అని సన్నగా గొణుగుతున్నట్టు అన్నాడు. "ఇంతవరకూ ఎందుకున్నారు? డాక్టరు దగ్గర చూపించకుండా?" అని అడిగితే "చూపిస్తూనే వుంటిమిరా; ఆకలి లేదు అంటే ఆకలి కావడానికీ, వాంతికి వచ్చినట్టుంది అంటే పైత్యం వల్లనేమో అని వాంతులు తగ్గడానికీ ఒళ్ళు నొప్పులు అంటే బలహీనం వల్ల అంతే అని ఒళ్ళు నొప్పులు తగ్గడానికీ విడివిడిగా మందులు మాత్రలూ ఇస్తూ వచ్చింది లేడీ డాక్టరు. మూడు రోజుల నుంచి ఆమె దగ్గరకే పోతూ వున్నా. ఆమె కూడా కనుక్కోలేకపోయింది అవి కామెర్లని. ఇక మేము ఏం చేసేది?" అంటూ నిస్సహాయంగా మాట్లాడినాడు అన్నయ్య.

అమ్మ...! అమ్మ...! ఏం డాక్టర్లూ ఏం మందులూ! నా ప్రాణాలిచ్చి అమ్మ ప్రాణం కాపాడుకునే అవకాశమే వుంటే ఎంత బావుణ్ణు. మా కోసం వెమటోడ్చి కష్టపడి పెంచి పెద్దచేసిన మా అమ్మలేని ఇంటిని ఎలా ఊహించుకునేది?

నాకు అమ్మ అంటే ఇష్టం. అమ్మకంటే అమ్మా... అనే మాట నాకు మరీ ఇష్టం. ఆ మాటలో సృష్టి ప్రతిధ్వనిస్తుంది. పాలసముద్రం పొంగుతుంది. వేషాల్ని కడిగేసుకునీ తొడుగుల్ని తీసేసుకునీ అస్తిత్వం తన శిశు నగ్నత్వంతో కేరింతలు కొడుతుంది. ఇంద్రియాల వలయంలో కీటకంలా గింగిరాలు తిరిగే అహంకారం- ఆమె భావనలో ఆర్ద్రమై శుద్ధమై కాంతితో మెరిసి ప్రేమగా పరిణమించింది.

తప్పొప్పుల పట్టికను పక్కకునెట్టి మనిషి మనిషి లోనూ తన రక్తమే అనుకుని అక్కున చేర్చి లాలించి చెట్లూ పక్షులూ జంతువులూ... ప్రకృతిలోని ప్రతి చైతన్యపు కదలికకూ మురిసే తన వాత్సల్యంతో, నిరపేక్ష ప్రేమతో, హృదయపు మూలమూలల్నీ స్పర్శించి దీవించి పునీతం చేస్తుంది అమ్మ! నా పిలుపులో బాధలో మౌనంలో ఎప్పుడూ ఆమె కోసమే వెదుక్కుంటూ వుంటాను.

కానీ,మా అమ్మ మనసు నిండిపోయింది- ఆ గొప్ప ప్రేమతో కాదు. తన శ్రమ జీవితపు కాఠిన్యంతోనే. పని భారమూ, దారిద్ర్యమూ, పస్తులూ, కీళ్ళ నొప్పులూ... అన్నీ కలిపి ఒక క్రూరత్వమై కఠి నత్యమై తెరమరుగు నుంచీ ఆడిస్తుంటే కసితో, కోపంతో, ద్వేషంతో, అపార్థాల్తో ఆమె జీవితం ఒక కీలుబొమ్మైౖ కదులుతుంది. వర్తమానం లోని ఆమె ఆవేశాల్నీ ఆలోచనల్నీ యాంత్రికంగా ప్రేరేపించి నడిపించే ఆమె గతాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. అందుకే నాకు మా అమ్మ మీద ప్రేమ సానుభూతి వున్నాయి.

ఇంట్లో అందరికీ ఆమె అరుపుల్తోనే తెల్లారి పోతుంది. "ఒరే! పెద్దనా కొడకా! లెయ్, లెయ్ నిన్నవాకొడకా! నీకేమొచ్చిందిరా?తెల్లగా తెల్లారిపోయి అందరూ ఇండ్లలో పనీపాట చేసుకుంటుంటే మీరు దున్నపోతుల మాదిరి నిద్రపోతారు కదరా. మీకు దూము తగలా—దుప్పటికప్పా. ఒసే సరోజా! ఆ మూలకు ఆనుకుని నిద్రమొగంతో తూగకపోతే పొరక తీసుకుని ఇంట్లో పాచికసువులూడ్చకూడదా? రేపు నీకు పెళ్ళయినా పనీ పాట చేతకాకపోతే మీ అత్తింటి వోళ్ళు నన్ను వూస్తారే దౌర్భాగ్యపు ముండా!"

"ఛూఛూ! దరిద్రం, పొద్దుపైకి ఎక్కినా నిద్ర పోయే వాళ్ల ఇంట్లో లక్ష్మి నిలవదురా అని నెత్తిన నోరుపెట్టుకుని అరిచినా మీకు తెలివి రాదు. ఈళ్లు అందరితో ఎల్లరా సచ్చేది దేవుడా" అంటూ ఇంట్లో ధనలక్ష్మి ఆసీనురాలు కాకపోవడానికి కారణం కనుక్కున్నట్లూ కూతురు ఒక అత్తింటి కోడలు అయితే ఆ అత్తింటి నుంచి ఏ రిమార్కూ రాకుండా, ఏ సూటి పోటి మాటలూ తగలకుండా ఇప్పటినుండే ఒక కవచాన్ని సిద్ధం చేసుకుంటున్నట్టూ మాట్లాడి హఠాత్తుగా అసలైన కీలకం దొరికినట్టు నిండా ముసుగు



— స్వామి

పెట్టే నిద్రపోయే తన భర్త మీద విరుచుకు పడుతుంది.

'ఈళ్లని అని ఏం లాభం? నిన్ను అనల్ల... నిన్ను కూడా ఎందుకు అనల్లలే పాపం- నీకు ఇచ్చి కట్ట బెట్టిందే మాయమ్మ... ఆ లంజముండను అనల్ల. పెండ్లి అయ్యేవరకూ అదీ పెండ్లి అయినాక నీవూ నన్ను రోపచ్చుకుని తింటిరి. 'అయ్యో బగమంతుడా! నాలుగు ఎనుముల పని ఒకదానికే ఇడిసిపెట్టి నువ్వు ఈది పట్టుకుని పోతాంటివి- పన్నపిల్ల తల్లిపాపం ఎట్లు చేసుకుంటుంది అని కనికారమైనా లేకుండా! తెల్లవారి జామున పరిలో లేచి నాలుగు ఎనుగొడ్ల కింద పేడా కసవూ నూకి, దాన్లకి నీల్లు పోసిపై కడిగి పాలు పిండి తీసుకుపోతే- పాపం ఆ హోటలు సామి అంగలాసే వాడు. 'పచ్చి బాలింతరాలివి ఎంత కష్టమొచ్చె గంగమ్మా నీకు' అని! ఆ ఎర్రెనుము ముండ వుండె కదా, అది ఉత్త హరాంది. యాటికి అంటే ఆటికి పరుగెత్తేది. 'ఓ అన్నా దాన్ని ఇట్ల అదిలించన్నా. ఓ అన్నా దాన్ని అట్లా పట్టుకోన్నా' అని పకంలోంచి సన్నపాపను ఎగేసుకుంటా కనిపించిన వాళ్లని బతిమాలుకుంటూ పరుగెత్తేదాన్ని. 'రామాకిరిణ్ణా ఎంత బాదొచ్చి పడెరా నాకు' అని ఒక్కదాన్ని కుల్లికుల్లి ఏడ్చేదాన్ని'' అని ఇంకా ఏదో మాట్లాడబోయేంతలో 'ఛా మీయమ్మ దర్వేసిముండా' అంటూ నాయన గబుక్కున ముఖం మీంచి దుప్పటి పీకి పారేసి పరుగెత్తుతున్నట్టు నడిచేవాడు ముఖం కడగడానికి బాత్‌రూము వేపు.

''ఇప్పుడు అంత కష్టం లేదు కదమ్మా! నువ్వూ మా నాయన మాదిరి కాలుమీద కాలు వేసుకుని ఊరికే చూస్తూ కూర్చో కూడదా? నువ్వు కాళ్ళతో పని చూపిస్తే చేతుల్తో చెయ్యడానికి మేము లేమా, నీ కోడళ్ళు లేరా?'అని చెప్పబోతే ''ఆ... బొలె మిటికివారులే అప్పా మీరంతా మీరు నిద్రా ఆగా రాలు లేకుండా కష్టపడి వుంటేనే పాపం- ఇల్లు ఇంత అబివురుద్ది లోకి వచ్చిందేది'' అంటూ ఒక వ్యంగ్య వైభవంతో దులిపి పారేస్తుంది. ఒకవైపు కష్టపడుతూ మరొక వైపు ఇతర్లకి తన కష్టాలు చెప్పకుంటూ 'అబ్బ ఎంత కష్టపడుతున్నావమ్మా' అంటూ సానుభూతి పొందడంలోనే ఆమె తన తృప్తినీ జీవిత పరమార్థాన్ని వెదుక్కుంటుంది.

కొంచెంసేపు ఆగి ఆమె నాయన తరపున బంధువుల మీద విరుచుకుపడుతుంది. ''ఇంట్లో సంకటి కెలికితే మీ యన్నలూ వచ్చి తినిపొయ్యేదే, మీ తమ్ములూవచ్చి తినిపొయ్యేదే. వాల్ల కూలిదుడ్లు మాత్రము పైసా పైసా గంటు ఏసి మూటకట్టివాల్ల ఇండ్లకు పంపించుకునేదే. అంత ఈనమైన వోల్లు మీ బండీవాల్ల జాతి. అప్పుడు పెద్దోడు కడుపులో వుండె. తొమ్మిది నెలల నిండు మనిసిని. ఒక ముద్దవడక అయినా మిగిలిస్తారేమో అని ఆశగా కాసుకునేదాన్ని. ఊహూ... మనం తినిపోతే ఈయమ్మకు ఏమన్నా మిగులుతుందా లేదా అనే అర్థజ్ఞానము వాల్లకు యాడిది? నిందుమనిసిని. పస్తులు పడుకుంటాంటి. మా పుట్టింటోల్లు ముద్దతిండువు రమ్మని పిలిస్తే అప్పుడే తిన్నానని అబద్ధం చెబుతాంటి. నామర్యాద ఒకటీ నా అత్తింటి మర్యాద వేరొకటీనా? అనుగుని!ఆ పొద్దునుంచి ఒకటే కష్టమే... ఒకటే కష్టమే! ఎంత కష్టము అనుబవిస్తివే అని నోరు తెరిచి అడిగిన మానుబావుడు కాదు నీవు!'' అంటూ జలజలా కన్నీల్లు కార్చి ఛర్రుమని చీది కొంగుతో తుడుచుకుంటుంది.

ఆమె చెల్లెలో తమ్ముడో పిన్నమ్మనో ఎవరైనా సరే తన తరుపు బంధువులు ఇంటికి వస్తే, ఆమె ముఖం వేయిరేగుల పద్మంలా విప్పారుతుంది. కాని అమ్మకంటె ఆ వచ్చిన వాళ్ళే మంచి వాళ్ళనీ, నెమ్మదస్తులనీ ఎవరైనా నోరుజారి అన్నారా... ఇక అంతే! ఆ మంచి పేరు తెచ్చుకున్న వాళ్ళ మీద వెంటనే కారాలు మిరియాలు నూరడం ప్రారంభిస్తుంది.

నవ్వుతూ నవ్వుతూ వున్న నవ్వును మధ్యలోనే ఊద్దేసుకుని ముఖం మట మట మాడ్చుకుంటుంది. గొణుగుతుంది. విసుక్కుంటుంది. చిర్రుబుర్రులాడు తుంది. వాళ్ళ మీద తన పాత 'కంప్లయింట్స్' ఏమైనా వుంటే అన్నీ బాగా గుర్తు తెచ్చుకుని సిద్ధమై దాడి మొదలు పెడుతుంది. ఒకవైపు పిర్రను గిల్లి మరో వైపు ఏడవ్వద్దు అంటూ సముదాయించే 'టెక్నిక్'తో కలహం ప్రారంభిస్తుంది. ఆ మాత్రపు ఎత్తుగడకే అవతలి వాళ్ళు మెత్తబడి చేతులెత్తేశారా... సరే! లేక పోతే ఇక భీకరమైన యుద్ధమే. ఈమె పోరాట పటిమకు నిలవలేక అవతలి వాళ్ళు ఇల్లు వదలి పారిపోవలసిందే బ్రతుకు జీవుడా అంటూ!


తన తల్లిని భర్త పన్నెత్తు మాట అనకూడదు. అంటే మాత్రం సహించదు. పాము తోక మీద లేచి

## ఇది స్వామి రాసిన అచ్చ తెలుగు కథ

బుసకొట్టినట్టుగా - స్రుమని ఇంతెత్తుకు లేచి మాటకు మాట తిప్పికొట్టి తన పుట్టింటి గొప్ప తనాన్ని కాపాడుతుంది. కానీ ఆమె అమ్మే ఇంటికి వస్తే 'అవ్వావొచ్చె అవ్వ వొచ్చె' అని మేమంతా ఆప్యాయంగా చుట్టేసుకుంటే మాత్రం తనే తన తల్లి మీద అసూయతో భగ్గుమని వైరం పూనుతుంది. తన పిల్లలు తనను తప్ప ఇతళ్లని ప్రేమించడం గాని మెచ్చుకోవడం గాని చెయ్యరాదు; చివరకు తనను కట్టుకున్న భర్తనైనా సరే!

''నాకు ఒడి బియ్యము పెట్టక మూడేండ్లు దాటిపాయ. ఏమి? ఆరు పిల్లకు ఇంత రవిక బట్ట పెడితే మీ గంటు ఏమయినా కరిగి పోతుందా? అంటూ మూతి పొడుస్తుంది. ''నాకు తల్లి లేదు. పుట్టిల్లూ లేదు అనుకుంటాను. మల్లీ యాల వస్తివీ నా ఇంటికి? మీరేమి బాగుపడతారుపో ఆడపిల్ల ఉసురు పోసుకుని. నీ కడుపు కాలిపోనూ, నీ వంశం పాడుగానూ. మా ఆడపల్లి శాపం తగిలే నీ గొర్లు రోగమొచ్చి సచ్చిపోతాండాయి'' అంటూ శాపనార్థాలతో విజృంభించగానే ''వస్తా నాయనా. నా కూతురే నాకు పరాయిది అయిపోయింది. మీరంతా సల్లగా ఉండండప్పా! నాకంతే సాలు'' అంటూ చేత్తో కర్ర అందుకుని అల్లుడూ, మనుమళ్ళూ అందరూ బతిమాలుతున్నా వినక కనుగుడ్ల నిండా నీళ్ళు కుక్కుకుంటూ పోతుంది అవ్వ.

''ఆడదాన్ని అణిచేసి అదుపులో పెట్టుకోవల్లరా? లేక పోతే సంసారాలు జరుగవు'' అంటూ, ఓ వైపు భార్య నోటికి భయపడుతూనే తన మగతనం చాటుకోవడానికి ఆమెను కొడుతూ తిడుతూ తెలివిగా ఆ పనీ ఈ పనీ అంతా ఆమె తల మీద మోపి ఆ వెట్టి చాకిరి కిందే భార్య జవసత్వాన్ని అణిచేస్తూ, ఎప్పుడూ మీసం మెలిపెడుతూ




కన్పించే నాయన హఠాత్తుగా చనిపోయాడు. దానితో ఇంటి పెత్తనమంతా అమ్మ చేతుల్లోకి పోయి కూర్చుంది! అణిచి పెట్టిన నీటి బుగ్గ ఒక్కసారిగా బుస్సు మని పైకి పొంగినట్టయింది. భర్త అన్నాళ్ళూ తనతో అణచిపెట్టిన అధికారమంతా కొడుకులూ కోడళ్ళపై చూపడం మొదలు పెట్టింది.

''నాకూ వుండారు కొడుకులు. యాల? ఉత్త ముదనష్టపు నాకొడుకులు. పక్కింటి సూరమ్మ కొడుకుల్ని చూడు; వజ్రాలు! ఒకనికి రివెన్యూ ఇనస్పెక్టరు ఉద్యోగమంట. మరొకనికి టాక్సులు ఏసే ఆఫీసులో అదేదో పని అంట. ఒకడు అప్పుడే ఇల్లు కట్టినాడు. మరొకడు ఊరి బయట చేనుకొని ప్లాట్లు వేసి అమ్ముతున్నాడంట. మరి ఈల్లూ...? ఈల్లకీ వుండాయి ఉజ్జోగాలు. కానీ ఒక్కనికీ ఒక దమ్మిడీ పై సంపాదన రాదు. చూస్తేనేమో మల్లీ ఇంటినిండా పుస్తకాలే! ఏం పుస్తకాలో... కూటికీ కూరకూ రాని పుస్తకాలు. ముందు ఈ పుస్తకాల్ని తూకాలకు ఏసి అమ్మితే తప్ప ఈ కొంప బాగుపడదు'' అంటూ చలం, బుచ్చిబాబు, గోపీచంద్, కొ.కు. వంటి ఘనా ఘనపు రచయితలందర్నీ ఒక గోనపట్ట సంచిలో కుక్కి బాత్ రూము గోడలపై అరుగుల మీద పేర్చిన పాత సామాన్ల లోకి గిరాటు వేసి, ''అమ్మయ్య పీడ విరగడైపోయింది'' అని నిట్టూర్చింది.

కోడళ్ళు ఒక చోట చేరి కబుర్లు చెప్పుకుంటే అనుమానం; తన మీద కుట్ర పన్నుతున్నారేమో అని. సరదాగా నవ్వితే సందేహం; వాళ్ళ నవ్వులన్నీ తన గురించేనేమో అని.


తన కూతురి కొడుకులు ఎప్పుడైనా ఇంటికి వచ్చినప్పుడు ''ఈరోజు ఎసట్లోకి ఎన్ని బియ్యము పొయ్యాల్ల అత్తా?'' అని కోడళ్ళు అడిగితే దానికి ఒక పెడ అర్థం తీసి ''పొండిరా పొండి; ఈ ఇంట్లో తినే దానికి మీరు నోచుకోలేదు నాయనా! మీారు ఇక్కడ ఒక పూట తింటే ఈల్లు పుట్టింటి నుంచి మోసుకొచ్చిన సొమ్మంతా కరిగి పోతుందంటరా నాయనా'' అంటూ శోకాలు తీసి తన మనుమల మీద తనకు తప్ప ఇతర్లకు ప్రేమ లేదని నిరూపించేసి తృప్తి పడుతుంది.

కోడళ్లు తన అంచనా ప్రకారమే బియ్యం పెట్టి వండితే; ఖర్మగాలి అందరూ తిని లేవాక ఏమైనా మిగిలితే ''ఇంతింత అన్నం పారవేసే దానికి ఇదేమైనా సత్రమా సంసారమా?'' అంటూ విజృంభిస్తుంది. తుమ్మినా కష్టమే; చీదినా కష్టమే! ఈ అత్తతో ఏగేది ఎట్లబ్బా అనే అయోమయత్వంలో కోడళ్ళను పడేసి, కత్తికి రెండు వైపులా పదును పెట్టే పరిపాలిస్తుంది తన గృహ రాజ్యాన్ని.

మరీ అవసరమైనప్పుడు కోడళ్ళకు ఒకరి మీద మరొకరికి చాడీలు చెప్పి, వాళ్ళు రెండు రోజులు మూతులు ముడిచి మూడో రోజు దెబ్బ లాటకు దిగితే, అప్పుడు వాళ్ల తగవుల మధ్యతల దూర్చి ఇంటి పెద్దగా వ్యవహరించి న్యాయం గూర్చి తీర్పు చెప్పిన తన పెద్దరికాన్ని మరొక మారు తడిమి చూసుకుని తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటుంది.

కోడళ్ళను తన చెప్పు చేతల్లో పెట్టుకుందని ఇరుగు పొరుగు అమ్మలక్కల మధ్య అమ్మకు గొప్ప కీర్తి. ఏ ఇంటి కోడలైనా వచ్చి ' మా అత్త నన్ను ఎట్ల సతాయిస్తుందో చూడు పెద్దమ్మా' అని ఫిర్యాదు చెయ్యాలి గాని, ఆమె అత్త మీద తన పాత పగలు ఏమైనా వుంటే వాటిని పురస్కరించుకుని కసితీరా నాలుగు తిట్లు తిట్టి, ఆ కోడలు పాపను సానుభూతి మాటల్లో ఓదార్చి మంచి పేరూ సంపాదించుకుని - ఆ విధంగా దెబ్బకు రెండు పిట్టలు పడే సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుంది.

ఎంత బుర్ర ఖర్చుపెట్టి ఎంత తెలివి ప్రయోగించీ, తన అనుమానాల్తో సందేహాల్తో తను బాధపడీ, కక్ష సాధింపు చర్యల్తో ఇతర్లను బాధపెట్టీ, వీధి అరుగుల మీాద జరిగే ఆడంగుల శిఖరాగ్ర సమావేశాల్లో ఇంటి యజమానురాలిగా ఎంత గొప్పపేరు సంపాదించుకునీ... అమ్మ ఒక పసిపాపై ఆడుకుంటుంది తన మనుమనితో. కొంగుకు ముడివేసుకున్న చిల్లర డబ్బు తీసి రోడ్లో తోపుడు బండిలో అమ్మే బొరీలు, మిఠాయిలూ కొనిపెడుతుంది. నాన్నమ్మా పిల్లి కథ చెప్ప అని వచ్చీ రానీ మాటల్తో అడిగితే పిల్లి కథనా అంటూ మురిపెంగా నవ్వి ఒకసారి ముద్దు పెట్టుకుని కథ చెప్పడం ప్రారంభిస్తుంది. తన దగ్గరే పడుకోబెట్టుకుని మనుమని నోటికి చన్ను అందించి కళ్ళు మూసుకుంటుంది. ''నేను చచ్చిపోతే నువ్వు అయినా ఏడుస్తావా నాయనా?'' అంటూ వాన్ని గుండెలకు



ఇది స్వామి రాసిన
అచ్చ తెలుగు కథ

అదుముకుంటుంది.

ఏ కొంచెం భయంలో ఉంచుకుంటే తప్ప ఈ కాలపు ఆడపిల్లలు మాట వినరని, చీటికి మాటికీ వాళ్లను అరుస్తుంటామను కానీ నా కోడళ్లు నిజంగా రత్నాలమ్మా అంటూ అప్పుడపుడు కోడళ్ళను మెచ్చుకుంటూ అందర్నీ ఆశ్చర్యాంబుధిలో ముంచేస్తుం టుంది.

ఎప్పుడయినా కొంచెం కులాసాగా అనిపించినపుడు మా నాయన వైపు చూసి నవ్వి మళ్ళీ మా వైపు తల తిప్పి "బడిలో చదివేటపుడు మీ నాయన కంటే నేనే బాగా రాసేదాన్ని అ ఆలు. మీ నాయన ఉత్త మొద్దు. నేను లేచి నిలబడి అయ్యవారి ముందర పద్యాలు గడగడా ఒప్పచెబుతాంటే మీ నాయన గోడకు ఆనుకుని నిద్రపోతా వుండె" అంటూ ముసి ముసిగా నవ్వేది అమ్మ.

"అప్పటికి ఇంకా ఇంగిలీసోల్లే రాజ్యము ఏల తాండిరి. అప్పుడు కట్టిందేటినే ఆ కలెకటరు బంగలా, ఇంజనీరు కాలేజూ! కలెకటరు బంగలాకి నేను రాల్లు మోస్తాంటి. ఇంజనీరు కాలేజి కట్టేటపుడు ఇంతింత బానల్తో నీల్లు పట్టి డమ్ములకు నింపి సిమెంటు గోడలకు సల్లుతాంటి. "చూడు ఇప్పటికే ఆ బిల్డింగులు ఎంత భద్రంగా ఉన్నాయో!" అంటూ గర్వపడుతూ తన స్మృతుల్ని ఏకరువు పెడుతుంది.

అమ్మ!! కష్టాల మధ్య పుట్టి కష్టాల మధ్య పెరిగి జీవితమంతా కాయకష్టం చేసి చేతుల్తో పాటు మనసు కూడా మొద్దుబారి పోయిన అమ్మ. హృదయంలోని లాలిత్యాన్నీ, మార్దవత్వాన్నీ శ్రమ సంస్కృతిలోని మోటుతనానికి బలిపెట్టిన అమ్మ! "చెయ్యెత్తి ఒక సారైనా నీ పెళ్ళాన్ని కొట్టని-నాన్ని-నువ్వేం మొగుణ్ణిరా?" అంటూ ముక్కు మీద వేలు వేసుకుని




ఆశ్చర్యపడిపోయే పాతకాలపు మనిషి అరవై ఏళ్ళు దాటిన మా అమ్మ!!

ఆమె శరీరంలోని ప్రతి అణువూ మృత్యువుతో పోరాడుతోంది. ఆస్పత్రి పడక మీద రాత్రంతా నిద్రలేక కడుపు పిసుక్కుని బాధ పడుతూ బయట పడని మల మూత్రాల కోసం బాధగా మూల్గి మూల్గి రామా అని పలవరిస్తూ,లేపి మంచానబెట్టి తడిసిపోయిన లంగా తీసేసి పొడిబట్టలు కట్టించి కాసేపు స్టూలు మీద కూర్చోబెట్టి ఆమెను అట్లే పట్టుకుని నేను మంచం వారగా కూర్చుంటే తన తల నా గుండెలో చేర్చి ఏదో భద్రతా భావంతో పసిపిల్లలా కునికి పాట్లు పడిన అమ్మ' 'ఏం కేంభయం లేదుమా' అని తన అర చేతిని నా చేతుల్లోకి తీసికుంటే "నేను చచ్చిపోనా? నాకు బాగు అవుతుందా?" అని ఆశగా అడిగి మళ్ళీ క్షణం ఆగి 'ఏమో' అని దిగులుగా సందేహం వెలిబుచ్చిన అమ్మ!

ఆజ్ఞలు జారీ చేస్తూ ఇంటా బయటా ఎంతో గంభీరంగా దర్పంగా బతికిన అమ్మ-కొంచెం కునుకు పట్టి నిద్ర పోతుండగానే నర్సు వచ్చి నిద్రకళ్ళు నలుముకుంటూ యాంత్రికంగా ఇంజక్షన్ గుచ్చితే నిద్రలోంచి ఉలిక్కిపడి బ్యారుమని పసిపిల్లలా... అచ్చం పసి పిల్లలా రోదిస్తే నాకూ ఏడుపొచ్చి కళ్ళల్లో చిమ్మిన కన్నీళ్ళు!

ఆమె చిన్న చిన్న సుఖాలూ, అల్ప సంతోషాలూ, ఇంటి బయట అరుగు మీద కూర్చుని పుగాకు నములుతూ వచ్చీ పోయే వాళ్ళతో విశ్రాంతిగా కబుర్లాడుతూ, ఊర్లో ఎక్కడ ఏ మూల ఏ ఆక్సిడెంటు జరిగిందో, మరేం విచిత్రం జరిగిందో అని వాకబు చేస్తూ తన చెవిలో పడిన వార్తలకు ఆశ్చర్య పోయి అవే వార్తలతో తోటి అమ్మలక్కలను కూడ ఆశ్చర్యపరచి సంతోషం పొందుతూ బడికి పోనని మారాం చేసే పెద్ద మనుమన్ని బుజ్జగిస్తూ మందలిస్తూ ఇది అచ్చం నా పోలికే అని మనుమరాలి ముఖంలోకి ఆపేక్షంగా చూస్తూ పోలియో డ్రాప్సూ, డి.పి.టి ఇంజక్షనూ వేయించడానికి పాపను చంకలో వేసుకుని డాక్టరు దగ్గరకి పోబోతూ 'మా ఇంట్లో పెండ్లి. మీరంతా రండి' అంటూ పాడుతూ తమాషాగా గెంతుతూ తన అపార్థాల్తో అనో హల్తో కొడుకుల్ని సందేహిస్తూ కోడళ్ళని తిడుతూ ఎవరికీ లేని బాధలు తనకే ఉన్నాయని లోకమంతా తన మీద సానుభూతి చూపాలని తాపత్రయ పడుతూ వడియాల మీద కాకులు వాలుతున్నాయనో, వాన వస్తే కట్టెలు తడిసి పోతున్నాయనో, బల్లి మీద పడింది-శకునం మంచిది కాదనో. ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి ఆందోళన పడుతూ తన ప్రేమలూ, ఆపేక్షలూ, కోపాలూ, విచారాలూ ఎప్పుడూ ఎవరో ఒకర్ని ఆడిపోసుకుంటుంటే తప్ప ఇంటా బయటా తన కిరీటం నిలవదేమోననే జాగ్రత్తలూ, భయాలూ, న్యూనతలూ, ఆధిక్యాలూ... తన అస్తిత్వపు బొట్టులో ఎన్నెన్నో రంగులు ఒడిగించుకుని అస్థిరంగా కదలి గబగబ మెరిసి క్షణానికోమారు చావు బతుకుల్లో ఊగి, శరీరం లోంచి బయటపడే దారి కోసం-ప్రాణం ఏవేవో గ్రంధుల్లో ముడిపడిన నాడుల్లో పెనగులాడి పెనగులాడి గింజుకుంటుంటే ఆయాసంతో రొప్పుతున్న ఆమె కడ చూపు కోసం 'అమా అమా...' అంటూ నేను బేలగా అరిస్తే మృత్యువు ముంచుకు వస్తోందని తెలిసి నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూసిన ఆమె కనుపాపల చుట్టూ కమ్ముకొచ్చిన కన్నీళ్ళు! సూత్రం తెగిన గాలి పడగలా పేగుబంధం తెగి పోతోందన్న దీనత్వం! ఒడ్డులు వేరయిపోయే ప్రయాణికులు ఒకరినొకరు పట్టుకుని ఏడుస్తూ హత్తుకున్న ఆలింగనం!

# ప్రవాసాంధ్రులు

## అమెరికాలో తెలుగు వెలుగు 'తానా'

పాశ్చాత్య సంప్రదాయపు పెనుతుఫానుకి రెపరెపలాడుతున్న భారతీయ సనాతన సంస్కృతిని ఉద్ధరించడానికి, మన తెలుగు పిల్లలు మన కట్టూ, బొట్టూ మరిచిపోయి, అరిసెలూ, ఆవడలు అంటే ఏమిటో తెలియక, హేమ్ బర్గర్లు, హాట్ డాగ్‌లకు అలవాటుపడిపోతున్న తరుణంలో తెలుగు వారికి వరప్రసాదంలాగ వెలిసిందొక సంస్థ. అదే తానా (TANA) అంటే తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా. అక్కడ ప్రతి రాష్ట్రంలో తెలుగు సంస్థలన్నీ కలిసి సంయుక్తంగా రెండేళ్ళకోసారి ఘనంగా తానా సభలు జరుపుకోడం ఒక ఆనవాయితీ. వేసవి సెలవుల్లో ఈ సభలు ఎంతో సంబరంగా జరుగుతాయి.

అమెరికాలో ఏళ్ళ తరబడి స్థిరపడిపోయిన తెలుగువాళ్ళు ఎందరో వున్నారు. అక్కడి వాతావరణానికీ, సంప్రదాయాలకీ అలవాటు పడిన వారికి మన పండుగలు, పబ్బాలు ఎప్పుడొస్తున్నాయో, వెళ్తున్నాయో గుర్తు పెట్టుకోడం కష్టమే. కానీ తానా సంస్థ తమ సభ్యులందరికీ, తెలుగుదేశంలోనే వున్నామనే భావన కలిగించడానికి ఎంతో కృషి చేస్తోంది. ఈ సభలలో అందరినీ ఒక వేదికపైకి చేర్చి మన కథలు, కబుర్లు చెప్పుకుంటూ మూడు రోజుల పాటు ముచ్చటగా ఉత్సవాలు జరుపుతుంది తానా. తానా సభలలో అక్కడి తెలుగువారి సాంస్కృతిక కార్యక్రమాలతో బాటు, మన రాష్ట్రం నుంచి కూడా కళాకారులు వెళ్ళి అందులో పాల్గొనడం ఓ ఆనవాయితీగా మొదటి నుంచీ వస్తున్నది. క్రిందటిసారి జరిగిన సెయింట్ లూయీ (ఈ సభలు ఒక్కోసారి ఒక్కో ప్రదేశంలో జరుగుతాయి) సభలలో హైదరాబాద్‌కు చెందిన వంశీ ఆర్ట్ థియేటర్స్‌వారు ప్రత్యేక సంగీత, నృత్య, నాటక కార్యక్రమాలను సమర్పించారు. ఈ సంవత్సరం వేసవిలో హ్యూస్టన్‌లో జరగబోయే సభలకు కళాకారులను, సాహితీప్రియులను ఆహ్వానించే కార్యక్రమం ఇప్పుడే మొదలైంది. విఖ్యాతులైన వివిధ రంగాల ప్రముఖులు పాల్గొనే ఈ సభలు జులై మొదటి వారంలో జరగబోతున్నాయి.

చిరునామా: డా. వి. జనార్ధనరెడ్డి
16219, LARK
FIELD-DR
HOUSTON
TEXAS 77059
U.S.A.

— మెజీషియన్ పట్టాభిరామ్


ఇది స్వామి రాసిన

అచ్చ తెలుగు కథ

హఠాత్తుగా బేదులూ వాంతులై వాటిల్లో రక్తం పడి, అకస్మాత్తుగా పల్స్ బలహీనమై పోయి సెలైన్ వాటర్ గబగబ శరీరంలో దూకి చలి కమ్ముకుంటే ఇంకా ఇంకా అలాగే మూల్గుతూ అందరినీ అయోమయంలో ముంచేసి బ్రతుకు నశ్వరత్వంలోకి ఊడ్చుకు పోయిన అమ్మ!!

చనిపోవడానికి గంట ముందు సెమీ కాన్షస్‌లో పడి మూడేళ్ళ చిన్న పిల్లగా మారి పోయి మారాం చేస్తూ అమ్మా నన్ను ఎత్తుకో అమ్మా నన్ను ఎత్తుకో... అంటూ అన్నాళ్ళూ తను ద్వేషించిన తల్లి కోసమే పలవరిస్తూ ఆమె అరిచిన అరుపులూ ఏడ్చిన ఏడ్పులూ నా చెవుల్లో గింగురు మంటున్నాయి.

అమ్మ చనిపోయిన మూడో రోజు "మీ అమ్మకు లాలపోసి ఉయ్యాలలో పడుకోబెట్టి పోతే నేలను కాళ్ళతో తన్నుకుంటూ ఆయమ్మ ఉయ్యాల ఆయమ్మే ఊపుకునేది నాయనా!" అంటూ చెబుతున్న అవ్వ. ఎందుకు అవ్వా మా అమ్మ నిన్ను ఎప్పుడూ తిడుతుండేది? కానీ చచ్చి పోయేటపుడు "అమ్మా నన్ను ఎత్తుకో..." అంటూ నీ కోసమే కలవరించింది. అని అన్నయ్య చెప్పగానే దుఃఖం ఆపుకోలేక బావురు మంటూ ఏడ్చింది అవ్వ.




"ఈ కూలిదాని కడుపున ఎందుకు పుడితివే గంగమ్మా! నిజమేనమ్మా చిన్నపుడు నిన్ను సరిగా ఎత్తుకోలేదు. నీ ముద్దూ ముచ్చట చూడలేక పోయినాను తల్లీ" అంటూ తల బాదుకుంటూ ఏడ్చింది.

"ఏం చెయ్యల్ల నాయనా? ప్రొద్దున నుంచీ పొద్దు గూకే వరకూ కూలికి పోయి కాయకష్టం చేస్తే పావలా దుడ్లు వచ్చేటివికావు. ఎనిమిదిమంది పిల్లలు! అందరినీ ఎత్తుగుంటూ ఆడించుకుంటూ తిరగడానికి మనం దొరలూ దొరసానులమా నాయనా? అందుకే నన్ను పిల్లప్పుడు మీ అమ్మా, చిన్నమ్మలూ ఆడుకుంటా మని ఏడిస్తే, ఆ చెంపా ఈ చెంపా వాయగొట్టే నవికి తోలేదాన్ని. లేకపోతే నా పిల్లోల్లు కడుపుకు ఇంత అన్నం తిని బతికి బట్ట కట్టే వాళ్లా? కోడి పిల్లల్ని కాపాడుకున్నట్టు కాపాడుగున్నాను నాయనా-నాకు పుట్టిన ఎనిమిది మంది పిల్లోల్లనీ!

"కష్ట జన్మాలు నాయనా కష్ట జన్మాలు! మీ అమ్మ ఎంత కష్టపడిందో మీకు సరిగా తెలీదప్పా! పొద్దున నుంచీ పొద్దుగూకేదాకా బురద మళ్ళలో నాట్లు నాటి ఇంటికొచ్చి ఇంకా కాల్లూ మొగమైనా కడుక్కోకుండానే నొప్పులొచ్చి నిన్ను తీర్త మాడింది" అంటూ తన కళ్ళ ఎదుటే కూతుళ్ళు ముసలాళ్ళై పోయి ఒక్కొక్కరూ రాలిపోతుంటే అరచేతి మందపు కళ్ళద్దాల్ని సవరించుకుంటూ జీవితాన్ని మాడటానికి ఇంకా ఇంకా తాపత్రయ పడుతూనే వుంది అవ్వ.

ముక్కుతో ఏదో పురుగును కరచుకొని పిల్లల కోసం గూటివైపు ఎగిరిపోయే పక్షిలో అమ్మ కన్పించి నా కళ్ళు తడి అవుతూనే ఉంటాయి.






# పెండేకంటి పబ్లిక్ స్కూల్

(సి.బి.ఎస్.ఇ. అనుబంధ సంస్థ)

ఇల్లూరు కొత్తపేట - 518 186 (బనగానపల్లె మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఎల్.కె.జి. నుండి 12వ తరగతి వరకు 1989-90 విద్యా సంవత్సరానికి

అడ్మిషన్లు ప్రారంభమైనవి!

ఇది, ఆదర్శవంతమైన గురుకుల పాఠశాల. బాల బాలికలకు ప్రవేశము కలదు. ఆరోగ్యకరము, ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణములో నెలకొల్పబడి, రాయలసీమలో రత్నాల ఖనియని పేరుగన్నది.

ఇది ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రతి సంవత్సరమూ పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించుచున్నది.

12వ తరగతి మొదటి బ్యాచి 89 మార్చిలో పరీక్షకు వెళ్ళుచున్నది. 11వ తరగతి నుంచి N.D.A., మెడిసిన్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు రెండేళ్ళ అదనపు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడును. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక ట్యూషన్ సదుపాయము కల్పించబడును.

పాఠ్యేతర, సహపాఠ్య విషయములకు తగిన ప్రాధాన్యత కలదు. సంగీతము, డ్రాయింగ్, యోగాసనములకు కోచ్‌లు కలరు.

బాల బాలికలకు వేర్వేరు వసతి కలదు. పుష్టికరమైన సంపూర్ణాహారము పరిశుభ్రంగా స్టీమ్ కుక్కర్లపై వండించబడును. మూట వలభై పడకల కొత్త అదనపు హాస్టల్ భవనము నిర్మించబడినది.

అన్ని అర్హతలు, శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు, అంకిత భావముతో విద్యార్థులను కన్న బిడ్డల వలె చూచుకొందురు.

సీట్లు పరిమితముగా కలవు. ప్రాస్పెక్టస్ కొరకు రూ. 25/- ఎం.ఒ. ద్వారా లేదా బ్యాంక్ డ్రాఫ్టు ద్వారా పెండేకంటి పబ్లిక్ స్కూల్ పేర బనగానపల్లె బ్రాంచ్‌లో చెల్లునట్లుగా మే నెల 20వ తేదీ లోపు పై స్కూల్ అడ్రస్‌కు పంపగలరు.

ప్రిన్సిపాల్